


# కరపత్రం

SINCE 2014

ఆదివారం మార్చి 29, 2026 సంపుటి : 2 సంచిక : 167 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4





## మూసీని అడ్డుకుంటే
# శివతాండవమే

- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**రంగారెడ్డి,మార్చి28**

రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళు.. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం.

మిగతాది 2 లో




## ప్రభుత్వ ఆధీనంలోకి
# హైదరాబాద్ మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి28 :**

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది.

2 లో



# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సిఎం రేవంత్ విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్,మార్చి 28 :**

కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది.

2లో..

# కంచె చేను మేసినట్లుగా ఉంది



- మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా
- నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
- మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క



**హైదరాబాద్,మార్చి28 :**

అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్మ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్టక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని..

02



# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

- పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

**హైదరాబాద్,మార్చి 28 :**

దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది.

2లో..




## పోలీస్ శాఖపై
# తీవ్ర నిర్లక్ష్యం

- నియామకాల్లో తీరని జాప్యం
- ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి
- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

**హైదరాబాద్,మార్చి28 :**

పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు.



2లో..

# ఐపీఎల్ బెట్టింగ్.. సజ్జనార్ వార్నింగ్

**హైదరాబాద్:**

ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నగరంలో బెట్టింగ్ ముఠాలకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రికెట్ క్రీడను జూదంగా మార్చి అమాయకుల జీవితాలతో ఆడుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం
# నిర్లక్ష్యం దారుణం

- డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి



2లో..

**హైదరాబాద్,మార్చి28 :**

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు.

# 'అక్రమ మైనింగ్ జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది?'



**హైదరాబాద్:**

నగరం నడిబొడ్డను అక్రమ మైనింగ్ జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ధ్వజమెత్తారు. కంచె చేనుమేసినట్లు.. రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు(శనివారం, మార్చి 28వ తేదీ) అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మైనింగ్ అంశంపై హరీష్‌రావు మాట్లాడారు.'రాఘవ కన్స్టక్షన్స్ నడుపుతున్న క్రషర్స్ కు ఎలాంటి అనుమతులు లేవు. జీవో ట్రిబుల్ వన్ వైలెట్ చేస్తూ ఆక్రమణ జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది?,

## పోలీస్ శాఖపై
# తీవ్ర నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్‌ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷–లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం
# నిర్లక్ష్యం దారుణం

మొదటిపేజీ తరువాయి

అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్‌లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పేస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

మొదటిపేజీ తరువాయి

చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆధీనంలోకి
# హైదరాబాద్ మెట్రో

మొదటిపేజీ తరువాయి

సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్–1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్–2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్–1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్–2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్–2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్–2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది.

# కంచె చేను మేసినట్లుగా ఉంది

మొదటిపేజీ తరువాయి

కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు.

వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆర్ఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. ఆ కంపెనీలో మంత్రి డైరెక్టర్ కాదని.. చైర్మన్ కాదని.. ఆ కంపెనీతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాపారం ఉంటే తప్పా అని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీ తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు సభలో సంచలన కామెంట్స్ చేశారు. తన వ్యాఖ్యలు తప్పయితే ఉరిశిక్ష వేయాలని సవాల్ విసిరారు. వ్యాపారం చేయడం తప్పు కాదని... కానీ మైనింగ్ లైసెన్స్ లేకుండా క్రషర్ నడపడం తప్పన్నారు. క్రషర్‌కు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు అనుమతి ఇవ్వాలని.. కేంద్ర పర్యావరణ అనుమతులు అవసరం లేదని హరీశ్ వెల్లడించారు. వెంటనే ప్యానెల్ స్పీకర్ బాలు నాయక్ స్పందిస్తూ.. 'హరీష్ రావు మీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి' అని కోరారు. వెంటనే హరీశ్ రావు మైక్ కట్ చేసిన స్పీకర్.. బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌కు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో పాల్వాయి హరీశ్ మాట్లాడుతుండగా సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చతో అసెంబ్లీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఐపీఎల్ బెట్టింగ్.. సజ్జనార్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి

గతంలో చేపట్టిన #SayNoToBettingApps ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన మద్దతు లభించిందని.. తద్వారా కేంద్ర ప్రభుత్వం వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించడమే కాకుండా కఠినమైన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును కూడా తీసుకువస్తోందన్నారు

అయితే ప్రస్తుతం ఈ వంచన కొత్త రూపం దాల్చిందని.. యాప్‌లు పోయినా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త వెబ్‌సైట్లను సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం ఆన్‌లైన్ మాత్రమే కాకుండా, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, ఇతర రహస్య స్థావరాల్లో గుంపులుగా చేరి ఫోన్ల ద్వారా ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. స్థానిక బుకీలు యువతను అప్పుల ఊబిలోకి నెడుతున్నారని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ చివరికి కన్నీళ్లే మిగిలిస్తుందని, బెట్టింగ్‌లో గెలిచేది కేవలం నిర్వాహకులు మాత్రమేనని, ఆడేవారు సర్వస్వం కోల్పోతారని హెచ్చరించారు. ఒక్కసారి ఈ వ్యసనానికి బానిసలైతే కుటుంబాలు రోడ్డున పడతాయని, క్రికెట్‌ను ఒక క్రీడగా ఆస్వాదించాలి తప్ప జూదంగా మార్చుకోవద్దని హితవు పలికారు.

యువతను ఈ బెట్టింగ్ భూతం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా మిమ్మల్ని వేధిస్తున్నా వెంటనే డయల్ 100కు గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555కు గానీ సమాచారం అందించాలని కోరారు.

# 'అక్రమ మైనింగ్ జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది?'

మొదటిపేజీ తరువాయి

క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలి. నిబంధనలను పాటించకుండా క్రషర్ నడుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది?, మైనింగ్ శాఖ షోకాజ్ నోటీసులతోపాటు డిమాండ్ నోటీసులు ఇచ్చింది.

రెండవసారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేని క్రషర్ ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ పంపినా చర్యలు లేవు. నేను చెప్పింది తప్పు అయితే నన్ను ఉరి తీయండి. మా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తమ్ముడు క్లస్టర్ లో చిన్న తప్పు జరిగితే రాత్రికి రాత్రే జైల్లో పెట్టారు.

**– మంత్రి పొంగులేటి రాజీనామ చేయాలి**

'తప్పులు చేశారు కాబట్టే ముఖ్య నెత సంస్థకు నోటీసులు ఇచ్చారు. ముఖ్య నేత క్లస్టర్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. అక్రమ మైనింగ్ కు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రిగా పొంగులేటి రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేశారు

**– హరీష్ వ్యాఖ్యలు ఖండించిన మంత్రి శ్రీధర్‌బాబు**

అక్రమ మైనింగ్‌పై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీధర్‌బాబు ఖండించారు. హరీష్‌రావు డిమాండ్ చేసినట్లు విచారణ చేయిస్తామని, అంతే కానీ స్లీపింగ్ రిమార్క్స్ చేస్తాం అంటే ఊరుకోమన్నారు. పొంగులేటిపై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. సభ రికార్డుల నుంచి హరీష్ రావు వ్యాఖ్యలను తొలగించాలని, వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం కరెక్ట్ కాదన్నారు.

# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

మొదటిపేజీ తరువాయి

ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు.

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గవర్నర్ దంపతులు భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా

భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో భద్రాచలంలో – భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# విజయవాడలో ఐజెయూ ప్లీనరీ ప్రారంభించిన సిఎం చంద్రబాబు

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) 11వ ప్లీనరీ సమావేశాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రులు పార్థసారథి, నిమ్మల రామానాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మీడియాతో తనకు మంచి సంబంధం ఉందన్నారు. 1996లో ప్రెస్ అకాడమీ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో జర్నలిజం బాగా మారిపోయింది. రాజకీయపార్టీలకు మీడియా సంస్థలు ఉండటం ప్రమాదం. ఫేక్ న్యూస్ ప్రమోషన్ డేంజరస్ ట్రెండ్‌గా మారింది. అసలైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇస్తాం అని అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ.. జర్నలిస్ట్ యాక్సిడెంట్ పాలసీని పునరుద్ధరించాలన్నారు. ఇళ్లస్థలాల అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. 15 రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వస్తోందని, ఏపీలోనూ అవకాశం మేరకు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కె. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రానికి అమరావతి తీర్మానం

**– ఏకగ్రీవ తీర్మానాన్ని పంపిన ప్రభుత్వం**

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి పంపించింది. కేంద్ర హోం శాఖ మంత్రి, రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీర్మానాన్ని పంపించారు. అలాగే కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఏపీ చీఫ్ సెక్రటరీకి తీర్మానం కాపీని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపారు. ఈ తీర్మానాన్ని మెయిల్ ద్వారా పంపడంతో పాటు, నేరుగా ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి ద్వారా ఢిల్లీకి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాయంత్రానికి ఢిల్లీకి తీర్మానాన్ని పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# హిందూ మతం నుండి మారితే

# ఎస్సీ హోదా కోల్పోయినట్టేనా!

బోయిని సత్యనారాయణ, అడ్వకేట్

- **హిందూ మతం నుండి మారితే ఎస్సీ హోదా కోల్పోయినట్టేనా! అంటే అవునని సుప్రీంకోర్టు చెబుతున్నది**

ఈనెల 24 మార్చ్ 2026 రోజున భారత సుప్రీంకోర్టు ఎస్సీ హోదాపై ఒక సంచలనాత్మక తీర్పు వెలువరించింది.

- **ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2025 ఏప్రిల్ 30న ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీం కోర్ట్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మరియు జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మార్చి 24 మంగళవారం తీర్పు వెలువరించింది**

### ఈ తీర్పు నేపథ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా పిట్టలవాని పాలెం మండలంలోని కొత్తపాలెం అనే గ్రామంలో ఒక ఇంట్లో చింతాడ ఆనంద్ అనే ఒక క్రైస్తవ పాస్టర్ ఆదివారము ప్రార్థనలు నిర్వహించి తిరిగి వెళుతుండగా హిందువులైన కొందరు ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు అతడిని అడ్డుకొని దాడి చేశారని కులం పేరుతో దూషించారని చెందోల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు హిందువులైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ద్వారా పోలీసులు అందరి కులాలు ధ్రువీకరించుకున్న తర్వాత 2021 ఏప్రిల్ 30వ తేదీన ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న వారు ఫిర్యాదుదారు అయిన క్రైస్తవ పాస్టర్ చింతాడ ఆనంద్ క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తి అని అతనికి ఎస్సీ హోదా వర్తించదని అందువల్ల ఆయన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తమపై నమోదు చేసిన కేసులు కొట్టేయాలని నిందితులు ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి వాదనలను పరిగణలోకి తీసుకున్న ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు నిందితులపై నమోదు చేసిన క్రిమినల్ కేసులను కొట్టేసింది.

- **హైకోర్టు తీర్పును ఆ క్రైస్తవ పాస్టర్ చింతాడ ఆనంద్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు**

ఆ కేసులోని ఫిర్యాదును, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ఉత్తర్వులను, ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించిన భారత సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పులు విలువరించింది. క్రైస్తవ మతంలోకి మారి ఆ మతం గురించి క్రియాశీలకంగా బోధనలు చేస్తూ మతాచారాలను పాటించే వ్యక్తులు ఎస్సీల కిందికి రారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.




- **సామాన్య భారతీయులకు తెలియని లోతైన అంశాన్ని సుప్రీంకోర్టు ప్రజల ముందుంచింది**

హిందూ బౌద్ధ సిక్కు మతాలు మినహా ఇతర మతాలవారు ఎస్సీలుగా పరిగణించబడరని,వీళ్లు ఎస్సీల క్రిందికి రారని స్పష్టం చేసింది. ఈ మూడు మతాలు మినహాయించి ఇతర మతాల్లోకి మారిన వారు వెంటనే ఎస్సీ హోదాను కోల్పోతారని పేర్కొంది

- **ఈ తీర్పు భారత రాజ్యాంగంలోని లోతైన అంశాలను తాకింది**

ఈ అంశంపై చర్చించే ముందు తీర్పులో పేర్కొన్న 1950 రాజ్యాంగ ఉత్తర్వుల గురించి తెలుసుకోవడం మంచిది. షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తులు, లేదా షెడ్యూల్ కులం నుంచి ఇతర మతంలోకి మారి కూడా రిజర్వేషన్లు కావాలని వాదిస్తున్న వారు భారత రాజ్యాంగం అంటే ఏమిటి? భారత రాజ్యాంగ ఉత్తర్వులు అంటే ఏమిటి? అనే చర్చలోకి వెళ్లక తప్పని పరిస్థితిని కలిగించింది సుప్రీంకోర్టు తీర్పు.

- **భారత రాజ్యాంగం (Constitution of India) అనేది దేశం యొక్క అత్యున్నత ప్రాథమిక చట్టం కాగా, 1950 రాజ్యాంగ ఉత్తర్వులు (Constitutional Orders, 1950) అనేవి రాజ్యాంగంలోని అధికారాలను ఉపయోగించి రాష్ట్రపతి జారీ చేసిన ప్రత్యేక ఆదేశాలు**

సుప్రీం కోర్టు తీర్పు భారత రాజ్యాంగ రచనలోని మరియు అమలులోని చాలా విషయాలను ఒక చర్చగా దేశం ముందు ఉంచింది.
పై పై ప్రస్తావనలు కాకుండా భారతీయులందరూ రాజ్యాంగం గురించి సమగ్రంగా తెలుసుకోవాల్సిన అవకాశాన్ని కల్పించింది భారత సుప్రీం కోర్ట్.

**ముఖ్య తేడాలు:**
కాన్స్టిట్యూషనల్ ఆర్డర్స్: రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 (గతంలో) వంటి నిబంధనల కింద రాష్ట్రపతి ప్రత్యేకంగా జారీ చేస్తారు. ఇవి రాజ్యాంగ ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి.
ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ (Executive Orders): సాధారణంగా ప్రభుత్వం యొక్క కార్యనిర్వాహక




చర్యల కోసం జారీ చేస్తారు.

సంక్షిప్తంగా, రాజ్యాంగపరమైన సవరణల కోసం (Constitutional Orders) మరియు పరిపాలనాపరమైన నిబంధనల కోసం (Presidential Orders) రాష్ట్రపతి ఉత్తర్వులను ఉపయోగిస్తారు, కానీ వాటి ప్రయోజనాలు వేర్వేరు.ఉపయోగాలు దేశ ప్రయోజనాల కోసమే.

పోలికలు (Similarities)
మూలం: రాజ్యాంగ ఉత్తర్వులు నేరుగా భారత రాజ్యాంగం నుండే పుట్టాయి. ఉదాహరణకు, "రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు 1950" అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 341(1) ప్రకారం జారీ చేయబడింది.
చట్టబద్ధత: రెండింటికీ సమానమైన చట్టబద్ధమైన అధికారం ఉంటుంది. రాజ్యాంగ ఉత్తర్వు ద్వారా నిర్ణయించబడిన జాబితాలు రాజ్యాంగంలో భాగంగానే పరిగణించబడతాయి.
భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిన సమయంలోనే, జమ్మూ కాశ్మీర్ వంటి అంశాలపై కొన్ని కీలక ఉత్తర్వులు కూడా అదే రోజున వెలువడ్డాయి.

- తేడాలు (Differences)

- **రాజ్యాంగం అనేది రాజ్యాంగ పరిషత్ (Constituent Assembly) ద్వారా రూపొందించబడితే..**

రాజ్యాంగ ఉత్తర్వులు రాజ్యాంగం కల్పించిన అధికారం ద్వారా రాష్ట్రపతి (President of India) జారీ చేస్తారు.

- **షెడ్యూల్డ్ కులాలు అంటే ఏమిటి?**

షెడ్యూల్డ్ కులాలు రాజ్యాంగ ఉత్తర్వు, 1950 ద్వారా రిజర్వేషన్లు మరియు ఇతర ప్రయోజనాల కోసం షెడ్యూల్ కులాలను గుర్తించడానికి ఇది పునాది.

- **సుప్రీంకోర్టు చెప్పిందేమిటి?**

ఎస్సీల కిందికి ఎవరు వస్తారు అన్నది రాజ్యాంగ ఉత్తర్వులు 1950లో స్పష్టంగా ఉంది.




ఆ ఉత్తర్వులలోని క్లాజ్ 3 లో పేర్కొన్న మతాలు మినహాయించి మిగిలిన ఏ మతంలోకి మారినా పుట్టుకతో సంబంధం లేకుండా ఆటోమేటిక్ గా ఎస్సి హోదా పోతుంది.అలాంటివారు చట్టబద్ధమైన ప్రయోజనాలు గానీ, రక్షణ గానీ, రాజ్యాంగం, పార్లమెంటు, శాసనసభలు చేసిన చట్టాల కింద పొందుపరిచిన రిజర్వేషన్లు గానీ హక్కులు గానీ ప్రాధాన్యతను గానీ పొందలేరు.

- **1950 రాజ్యాంగ ఉత్తర్వులు క్లాజ్ 3 ఎందుకు?**

ఈ ఉత్తర్వులు ఎందుకంటే.. ప్రపంచం మొత్తంలో కేవలం ఒక్క భారతదేశంలోనే కులం అనే విభజన ఉన్నది.
1950 రాజ్యాంగ ఉత్తర్వుల్లో పేర్కొన్నవి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు.ఈ మూడు మతాలతో పాటు జైన మతం కూడా ఈ కోవలోనే పరిగణించవచ్చు.రాజ్యాంగ ఉత్తర్వుల్లో పేర్కొన్న మతాలు భారతదేశంలో పుట్టినవి.క్రైస్తవం, ఇస్లాం, పారసిక మతాలు విదేశాల్లో పుట్టినవి.విదేశాల్లో పుట్టిన ఈ మతాలలో కులము అనే ప్రస్తావన లేదు, విభజన లేదు. కాబట్టి 1950 రాజ్యాంగ ఉత్తర్వుల్లో వివక్ష అనుభవిస్తున్న హిందూ సిక్కు బౌద్ధ మతాలను మాత్రమే పేర్కొన్నారు.

- **భారత రిజర్వేషన్ల వ్యవస్థలో కులం**

భారతదేశంలో ఎస్సీ, ఎస్టి, బీసీ, ఓ బి సి, ఓసి వర్గీకరణలో కేవలం ఎస్సీలలో మాత్రమే కులాలను షెడ్యూల్ గా వివరించారు.మొత్తము రిజర్వేషన్లలో కులం అనేది కేవలము ఎస్సీలకు మాత్రమే వర్తిస్తుంది. అవి షెడ్యూల్డ్ కులాలు.షెడ్యూల్డ్ కులాలు అనే వివరణ కేవలం ఎస్సీలకు మాత్రమే ప్రత్యేకించబడింది.ఎందుకంటే భారతదేశంలో శతాబ్దాలుగా అంటరానితనం వివక్ష అనుభవిస్తున్న కులాలను, వర్గాలను ఈ షెడ్యూల్ కులాలలో స్పష్టంగా వివరించారు.ఎస్టీలు అంటే తెగలు. షెడ్యూల్డ్ తెగలు.బీసీలు అంటే బ్యాక్ వర్డ్ క్లాసెస్ అంటే బలహీన వర్గాలు. అలాగే ఇతర వెనుక బడిన వర్గాలు మరియు ఇతర వర్గాలు అని రాజ్యాంగ రచన కమిటీ రాజ్యాంగ ఉత్తర్వులు మరియు ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా స్పష్టంగా పేర్కొన్నది.ఇతర ఏ వర్గాలలో కులం అనే ప్రస్తావన ఉండదు.కుల ప్రస్తావన కేవలం ఎస్సీలకు మాత్రమే వర్తిస్తుంది.ఎస్టీలకు బీసీలకు ఓబీసీలకు కుల ప్రస్తావన లేదు.

- **రాజ్యాంగం మరియు రాజ్యాంగ ఉత్తర్వులు, ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులు వేరువేరు కాదు**

సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా లేదని భావించేవారు ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ మార్చే వీలుందని, ఈ తీర్పును మార్చాలని కోరుకుంటున్నారు.

- **సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుపై సమగ్రమైన పరిశీలన కొరకు సుప్రీం కోర్ట్ ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు సమీక్షించే అవకాశం ఉన్నది**

భారత రాజ్యాంగాన్ని అర్థం కాని ఒక దేవతా వస్త్రంగా భావించే వాళ్లు చిలువలు పలువలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు.భారత రాజ్యాంగము ప్రపంచంలోనే అత్యుత్తమమైనది. మన భావావేశాలకు వ్యక్తిగత అభిప్రాయాల కొరకు రాజ్యాంగాన్ని కుదించి మాట్లాడకూడదు.షెడ్యూల్ కులాలు వివక్ష నుంచి విముక్తి పొంది తీరాల్సిందే. ప్రస్తుత భారతీయ సమాజంలో ఇంకా ఆ పరిపక్వత కనిపించడం లేదు.హిందూ మతములోని షెడ్యూల్డ్ కులాలు ముఖ్యంగా అంటరాని కులాలు తీవ్రమైన సామాజిక వివక్షను ఎదుర్కొన్నాయి.

- **రాజ్యాంగ రచనా కమిటీ పెద్దలు భారతీయ సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించి హిందువులలో సిక్కులలో మరియు బౌద్ధులలో మాత్రమే ఈ అంటరానితనం ఉందని స్పష్టం చేశారు**

ఈ అంటరాని కులాలు దళితులుగా పిలువబడుతున్నారు. షెడ్యూల్డ్ తెగలకు ఈ వివక్ష లేదు. కాబట్టి కేవలం ఎస్సీ కులాలలోని వారు మతం మారినప్పుడు వారికి ఎస్సీ కులాల ప్రయోజనాలు వర్తించకూడదని వర్తించదని సుప్రీంకోర్టు సమగ్రమైన తీర్పును ఇచ్చినట్టుగా న్యాయ కోవిదులు భావిస్తున్నారు.

- **ఎస్సీలు హిందూ మతం నుండి ఇతర మత విశ్వాసాలలోనికి మారినప్పుడు ఈ కులాలను తమ వెంట తీసుకుని పోలేరని, కాబట్టి భారత రాజ్యాంగం కల్పించిన ఎస్సీ వర్గీకరణ లోని ప్రయోజనాలను మతం మారిన వారు పొందలేరని సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సామాన్యులకు అర్థమవుతున్నది**

- **భారత రాజ్యాంగం పట్ల ఈ మధ్యలో లోతైన చర్చ జరుగుతున్నది. రాజ్యాంగం చదవని వారు తమ తమ అభిప్రాయాలతో తమ ప్రయోజనాల కోసం వాదనలు వినిపించేవారు ఒకే ఒక్క విషయం గమనించాలి**

భారత దేశ సుప్రీంకోర్టు తీర్పును మనం గౌరవించాలి.

- **భారత సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకించేవారు భారత రాజ్యాంగ రచనా స్ఫూర్తిని, రాజ్యాంగ రచన కమిటీ సభ్యులను ముఖ్యంగా స్వర్గీయ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని వ్యతిరేకిస్తున్నట్టుగా గమనించాలి**

# బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కరువు!

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చ్ 28**
బిజెపికి చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారనీ, ఇలాంటివారిని వెనకేసుకొస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ విమర్శించారు. శనివారం హనుమకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. బిజెపికి చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారని, ఈ ఆరోపణలపై రాజకీయ రక్షణ కింద ఆయా నేతలకు రక్షణ కల్పిస్తోందని ఎరాబెల్లి స్వర్ణ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ మహిళకు గౌరవం ఇవ్వాలని అంటారు. మహిళల సంరక్షణ గురించి మాట్లాడతారు.. దేశంలో మహిళల మీద జరుగుతున్నా దాష్టీకాల మీద మాత్రం పెదవి విప్పరు. మహిళా మంత్రులు మౌనంగా ఉంటారు, కేంద్రం సహా బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కొందరు మంత్రుల వ్యవహారం ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం ప్రరంభించినప్పుడ్డు వంద కోట్లకు పైగా హోర్డింగ్ లకు ప్రకటన ఖర్చు చేసారు. బిడ్డలకు కష్టం వచ్చినప్పుడు మాత్రం ఎవరు పట్టించుకోరా అని ప్రశ్నించారు? మహారాష్ట్రలో 58 మంది మహిళలను అత్యాచారానికి గురి చేసిన అశోక్ ఖరత్ కేసు, ఉత్తరాఖండ్ అంకితా భండారీ హత్య కేసు, ఉన్నావ్ అత్యాచార కేసు, హిమాచల్ ప్రదేశ్లో ఒక ఎమ్మెల్యే మైనర్తో అత్యాచారానికి పాల్పడిన కేసు, హర్యానా మహిళా కోచ్ను వేధింపులకు గురి చేసిన సంధీప్ సింగ్ కేసు వంటి ఉదాహరణలు ఇస్తూ, ఈ కేసుల్లో బిజెపి రాజకీయ రక్షణ కల్పిస్తుందని ఆరోపించారు. గుర్మీత్ రామ్ రహీమ్కు పరోల్ మంజూరు



చేయడం, బిల్కీస్ బానో కేసులో దోషులకు క్షమాబిక్ష ఇవ్వడం వంటి ఎన్నో కేసులు ఉన్నాయని, జెడి(ఎస్) మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణాపై ఆరోపణలు ఉన్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో అతనికి మద్దతు ఇచ్చారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, దోషి జెఫ్రీ ఎప్స్టీన్ మధ్య ఉన్న సంబంధాలు ఈ విషయంపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం విచారకరమన్నారు. బిజెపి ఎంపి సుబ్రమణ్య స్వామి కొంతమంది మహిళలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అక్రమ సంబంధం వల్లనే ఎంపిలుగా, మంత్రులుగా ఎదిగారని ఆరోపించారు. బిజెపి నేత సుబ్రమణియన్ స్వామి మహిళల గురించి సీరియస్ ఆరోపణలు చేసినప్పటికీ, ప్రధాని, పాలక పార్టీ, ప్రభుత్వం ఎవరూ స్పందించడం లేదన్నారు. సీనియర్ బిజెపి నేత సుబ్రమణియన్ స్వామి మహిళా ఎంపీల గురించి చేసిన వ్యాఖ్యలు చాలా సీరియస్. అయినా ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఏ విచారణ జరగలేదు. ప్రభుత్వం, బిజెపి, మహిళా ఎంపీలు ఇందుకు స్పందించకపోవడం విచిత్రం అన్నారు. ప్రధాని మోదీ నియోజకవర్గం వారణాసిలో గత ఏడాది 1686 మహిళలపై నేరాలు జరిగాయని, ఇది పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, మంత్రుల పరిస్థితి రేపిస్తులను వెనుకేసుకురావడ, విద్వేషాలు రెచ్చగొట్టెలా మతపరమైన స్టేట్మెంట్లు ఇవ్వడం బిజెపి లోని కొందరు ప్రజాప్రతినిధులకు పరిపాటిగా మారింది. ఇలాంటి చర్యలు, విధానాలతో అధికారం చేపట్టాలని, ఉన్న అధికారాన్ని కాపడుకోవాలని బిజెపి భావిస్తుంది. లైంగిక నేరాల ఆరోపణలు ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్నా, వారిని రక్షించే ధోరణి బిజెపికి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని కాపాడుతున్నారని ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. మహిళలు, బాలికలపై పెరుగుతున్న నేరాలు, అలాగే కొన్ని కేసుల్లో నిందితులకు కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం రక్షణ లభిస్తున్నట్లు కనిపిస్తున్న పరిస్థితులపై ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అత్యవసరంగా సర్కులర్ జారీ చేయడం జరిగిందన్నారు. కేంద్రంలో బిజెపి చేస్తున్న అరాచకాలను చూపిస్తూ జిల్లాలలో ప్రెస్ మీట్ పెట్టాలని, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అన్ని జిల్లాలలో ప్రెస్ కాన్ఫరెన్స్ లు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నీలం పద్మ, బంక సరళ, సునావత్ రాధా, రాష్ట్ర జిల్లా మహిళా నాయకులు, మండల మరియు డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి లను కలిసిన పిఆర్టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్

**కరపత్రం ప్రతినిధి మార్చి 28**
శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు నరసింహారావు, పింగిలి ప్రశాంత్ రెడ్డి లను వేర్వేరుగా పి ఆర్ టి యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి, శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. పిఆర్టియు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న నూతన సంవత్సర-2026 క్యాలెండర్ ను ఆవిష్కరించి, ఆర్కే వెంకటేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పిఆర్టియు రాష్ట్ర నేత ఆర్కే వెంకటేష్ మాట్లాడుతూ.. మీరు పోలీస్ శాఖలో అత్యంత శిఖరాలు అధిరోహించి మా ఉపాధ్యాయుల, ఉద్యోగుల కొరకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్పందించిన ఏసీపిలు తప్పకుండా పోలీస్ శాఖ తరపున ఉద్యోగుల, ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఆర్కే వెంకటేష్ తెలిపారు.

# తేజ్ దీప్ రెడ్డి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి వరంగల్ మార్చి 28**
అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ ఆధ్వర్యంలో నగరంలోని లూయిస్ అందుల పాఠశాలలో విద్యార్థులకు పండ్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ.. తేజ్ దీప్ రెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. పార్టీ పటిష్టానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం మార్చి 29, 2026

# ప్రధమ ఉత్తమ మహిళ అవార్డు అందుకున్న నసీమా

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 28:




సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని బంగ్లా ఏరియాలో చేపట్టిన మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా గత కొన్ని సంవత్సరాలుగా పారిశ్రామిక ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లో నిస్సహాయులకు అనేక సేవలందించి నిరుపేద విద్యార్థులకు మౌలిక వనరులు సమకూర్చి వైద్య సదుపాయం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు భరోసానిస్తున్న భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నసీమని ఆర్జి వన్ జనరల్ మేనేజర్ సతీమణి అనిత లలిత్ కుమార్ చేతుల మీదుగా ప్రఖ్యాతిగాంచిన మహిళల సమక్షంలో భరోసా నసీమను సన్మానించి పురస్కారం అందజేశారు. అనంతరం అనిత లలిత్ కుమార్ మాట్లాడుతూ భరోసా నసీమ ఒక సాధారణ మహిళగా ఉండి చిరు ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ సమాజాన్ని తన కుటుంబంగా భావించి ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ నిరుపేద విద్యార్థులకు స్కూలు యూనిఫామ్ దగ్గర నుంచి షూస్ వరకు బుక్స్ దగ్గర నుంచి పెన్స్ వరకు సమకూరుస్తూ విద్యారంగానికి విశేషమైన కృషి చేస్తున్న భరోసా నసీమని ఈ రకంగా సన్మానించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మహిళ అంటే ఒక శక్తి అని, ఆ మహిళా శక్తిని నిస్సహాయుల బ్రతుకుల్లో వెలుగులు తీసుకువచ్చే విధంగా భరోసా సేవల రూపంలో నసీమా తన శక్తిని చూపిస్తున్నదని, వారు రాబోయే రోజుల్లో మరెందరికో అమూల్యమైన సేవలు అందజేయాలని మనస్ఫూర్తిగా భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సేవలను గుర్తిస్తూ వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, మరిన్ని అవార్డులు వారికి అందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అభినందనలు తెలిపారు.

## వి.ఎస్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 28:



గోదావరిఖని మల్లికార్జున్ ప్రాంతానికి చెందిన మెకానిక్ జాఫర్ గత ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తన కాలు విరిగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న జాఫర్ కుటుంబానికి వెలుగు సామాజిక స్వచ్ఛ ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్లు గడవేన సునీత, సదానందం సహకారంతో నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమానికి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ హాజరై మాట్లాడారు. సమస్య ఎక్కడ ఉంటుందో తమ వెలుగు సంస్థ తమ వంతుగా సహాయం అందిస్తూ రావడం జరుగుతుందని సురభి శ్రీధర్ తెలిపారు. గోదావరిఖని మల్లికార్జున్ నగర్ చెందిన టూ వీలర్ మెకానిక్ జాఫర్ 20 సంవత్సరాలుగా మెకానిక్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ రావడం జరిగింది అని. గత ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తన కాలుకు విరిగిపోయి నడవలేని పరిస్థితిలో ఉండి మంచానికే అంకితం కావడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని. వైద్య ఖర్చులకోసం డబ్బులు పెట్టుకునే స్తోమత లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని తెలుసుకొని జాఫర్ కుటుంబానికి తమ వంతు సహాయంగా తమ సంస్థ ఆర్గనైజర్ ల సహకారంతో నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే జాఫర్ వైద్య ఖర్చులకోసం సహాయ సహకారాలు అందించాలని సురభి శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో సామాజిక సేవకురాలు ఉరకొండ రజిత, జాఫర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 28:




సింగరేణి సంస్థ చైర్మన్ అదేశాలతో సింగరేణి సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకముగా (సి.యస్.ఆర్) సామాజిక భాద్యత స్వయం ఉపాధి కల్పనలో భాగముగా సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు ఆర్జీ.1 టిటిసిలో వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణలో 18 రోజులు విటిసి నందు 12 రోజుల వరకు ఆర్జీ1 ఏరియాలోని టి.టి.సిలో నిర్వహించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ ఇచ్చు కార్యక్రమామానికి డి.లలిత్ కుమార్ జియం ఆర్జీ 1 ముఖ్య అతిథిగా హాజరై 49 మంది నిరుద్యోగ యువకులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భముగా జియం మాట్లాడుతూ వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ పొందిన వారు భారత దేశంలోనే కాకుండా విదేశాలలో అన్ని చోట్ల నడుచు వోల్వో డంప్ ట్రక్ లలో డ్రైవింగ్ శిక్షణ పొంది సర్టిఫికెట్ కలిగిన వారికి పని చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు ఆర్జి 1 టిటిసి నందు 13 బ్యాచ్ లో 651 మందికి సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగినదని, ఇందులో 130 మంది వివిధ కంపెనీలలో డంప్ ట్రక్ డ్రైవర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. శిక్షణ పొందిన నిరుద్యోగ యువకులకు శిక్షణ సమయంలో వారికీ ఉచిత వసతి, భోజనాలు కల్పించి ప్రత్యేకంగా వోల్వో డంప్ ట్రక్ కంపని వారి సహాహాకరంతో సింగరేణి డైరెక్టర్స్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ నిర్వహించడము జరిగిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.జి. 1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్, ఎస్ ఓ టు జియం చంద్రశేఖర్, టిటిసి మేనేజర్ అశోక్ రావు, జివిటిసి మేనేజర్ మాధవ రెడ్డి, పర్సనల్ ఆఫీసర్స్ శ్రావణ్ కుమార్, హన్మంతరావు, వోల్వో డంప్ ట్రక్ మేనేజర్ హరిబాబు, వోల్వో శిక్షకుడు సంజీవ్, టిటిసి స్టాఫ్ పద్మారావు, సత్తన్న, జివి రావు, ఆయుబ్ పాషా, కృష్ణ, అభ్యర్థులు పాల్గొన్నారు.

# వేములవాడ రాజరాజేశ్వర స్వామి కోడెల పంపిణీలో దరఖాస్తు చేసుకోగలరు పొనగంటి రాము 9వ వార్డ్ కౌన్సిలర్

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 28



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ పొనగంటి రాము మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే ముఖ్య సమాచారం వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ ప్రాంతంలో రైతులకు ఆర్థికంగా తోడ్పడే ఉద్దేశంతో ప్రభుత్వం కోడెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, వచ్చే నెల ఏప్రిల్ 7వ తేదీన తిప్పాపూర్ గోశాలలో సుమారు 300 కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.ఈ పథకానికి అర్హతల విషయానికి వస్తే, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1.5 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు వ్యవసాయ భూమి కలిగిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఆసక్తి గల రైతులు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ప్రతులు, అలాగే వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ ) ధృవీకరణ పత్రంతో అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన రైతులను ఎంపిక చేసి, వారికి జియో ట్యాగింగ్ విధానంలో కోడెలను అందజేస్తామని తెలిపారు. ఈ విధానం ద్వారా పారదర్శకత ఉండటంతో పాటు లబ్ధిదారులకు నిజంగా ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయం పొందాలని కౌన్సిలర్ పొనగంటి రాము పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇటువంటి పథకాలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# గర్భిణులకు బాలింతలకు అవగాహన సదస్సు

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 28





కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ధర్మారం అంగన్వాడి కేంద్రంలో మహిళలు, గర్భిణీలు, బాలింతలు చిన్నారుల తల్లుల కోసం విస్తృత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థ నిర్మాణానికి, భవిష్యత్ తరాల శ్రేయస్సుకు కీలకంగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా "1000 డేస్" (గర్భధారణ ప్రారంభం నుండి శిశువు రెండేళ్ల వయస్సు వరకు) అత్యంత ముఖ్యమైన దశ అని వివరించారు. ఈ కాలంలో తల్లి తీసుకునే ఆహారం, జీవనశైలి, ఆరోగ్య పరిరక్షణ శిశువు శారీరక, మానసిక అభివృద్ధిపై నేరుగా ప్రభావం చూపుతాయని తెలిపారు. సరైన పోషకాహారం, సమయానికి వైద్య పరీక్షలు, తగిన విశ్రాంతి తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన తరం నిర్మాణం సాధ్యమవుతుందని అవగాహన కల్పించారు.
అదేవిధంగా, రోజువారీ జీవితంలో షుగర్, సాల్ట్, ఆయిల్ వాడకంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ వాటిని పరిమితంగా వాడాల్సిన అవసరాన్ని వివరించారు. అధికంగా వీటి వినియోగం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని హెచ్చరించారు. అందువల్ల తల్లులు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమతుల్య ఆహారం అందించాలని సూచించారు.
పోషకాహారం ప్రాముఖ్యతపై కూడా విశదీకరిస్తూ, ఆకుకూరలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పోషక విలువలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఆహారంలో చేర్చాలని తెలిపారు. చిన్నారుల ఎదుగుదలలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా మొదటి రెండేళ్లు పిల్లల మెదడు అభివృద్ధికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. వారికి ప్రాక్టికల్ సూచనలు, ఆహార నియమాలు, పిల్లల సంరక్షణ పద్ధతులపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. తల్లులు కూడా కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేసి, తమ రోజువారీ జీవితంలో ఈ సూచనలను అమలు చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ శిల్పా గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యం అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి కార్యక్రమాన్ని సమన్వయం చేసి, అంగన్వాడీ టీచర్లు స్వప్న, రజిత సమర్థంగా నిర్వహించారు. స్థానిక తల్లులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డంపింగ్ యార్డ్ ను వెంటనే రద్దు చేయాలి

- లేకుంటే ప్రాణ త్యాగానికి సిద్ధం పోలాడి రామారావు

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:



హుజురాబాద్ ప్రాంత సిర్సపల్లి గ్రామ సరిహద్దు ప్రాంతంలో ప్రజాభి ప్రాయ సేకరణ చేయకుండా జనావాసాల మధ్య నెలకొల్పే డంపింగ్ యార్డ్ ను వెంటనే రద్దు చేయాలని రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. అలా కాకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపడితే ప్రాణ త్యాగానికి సిద్దంగా ఉన్నానని అన్నారు. శనివారం డంపింగ్ యార్డ్ ప్రాజెక్టు విరమించాలని నిరసిస్తూ హుజురాబాద్ లో భారీ సంఖ్య లో దీక్షా ధర్నా శిబిరంలో పాల్గొన్న మహిళలల కు మద్దతుగా పోలాడి రామారావు పాల్గొని ప్రసంగించారు. హుజురాబాద్ మున్సిపల్ ప్రాంత ఇప్పల్ నర్సింగాపూర్ లో రైతు మిత్ర ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి తో కలిసి నాయకులతో నిర్వహించిన సమావేశంలో పోలాడి రామారావు మాట్లాడారు.
గుట్టు చప్పుడు కాకుండా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలనే పాలకుల వైఖరి పై గత వారం రోజులుగా నిరసనలు మిన్నంటుతుంటే ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని రామారావు మండి పడ్డారు ఈ ప్రాజెక్టు వలన వాతావరణంలో ఎన్నటికీ నశించని విషపదార్థాలు వెలువడి పాడి పంటల దిగుబడి తగ్గిఅన్న దాతలకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రజలకు పశువులకు క్యాన్సర్ శోకుతుందని మనిషి ఊపిరి తిత్తులు దెబ్బతినడం తో పాటు గర్భిణీ స్త్రీలకు డెలివరీ సమస్యలు తలెత్తుతాయని తల్లి పాలు ఆవు పాలు, కూడా విశమైనీరు కలుషితమై భవిష్యత్ తరాలు వలస పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.
హుజురాబాద్ ప్రాంతమే కాకుండా
సమీప 4 జిల్లాల వరకు దీని ప్రభావం ఉంటుందని తెలిపారు.
అధికారులు పాలకులు మభ్య పెట్టే ప్రయత్నాలు మానుకొని ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా చేపట్టే ఇట్టి డంపింగ్ యార్డు పనులను తక్షణమే నిలిపివేసి జనావాసాలకు దూరంగా తరలించాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో రైతు మిత్ర ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహ రెడ్డి,రాష్ట్ర నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి, దండ వెంకట రమణారెడ్డి, బండి సమ్మయ్య, బండి శంకర్ గూడూరి చైతన్య రెడ్డి, తులసీ లక్ష్మణ్ కుమార్ దాస్, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# జగన్‌కు అధికార యావ తప్ప మరోటి లేదు నమ్మిన సిద్ధాంతం కోసం చంద్రబాబు ఆరాటం

- అమరావతి కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డ బాబు
- ఉమ్మడి ఎపిలోనూ మొక్కవోని ధైర్యంతో పని
- అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

కరపత్రం ప్రతినిధి అమరావతి,మార్చి 28 :
వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటలు మోసం, కుట్ర, నయవంచనకు ప్రతిరూపంగా కనిపిస్తున్నాయని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జగన్‌కు అధికారం తప్ప ప్రజల ఆకాంక్షలు కనిపించవంటూ మండిపడ్డారు. తెలుగుజాతికి చరిత్రలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో తమలాంటి వారు ఆ సభలో ఉన్నారని, తెలుగుజాతి బాగుండాలని చంద్రబాబు పడిన తపన తాము చూశామని చెప్పుకొచ్చారు. చంద్రబాబు ఎప్పుడూ నిబ్బరం కోల్పోలేదని తెలిపారు. సీఎంగా ఉండి కూడా బస్సులో పడుకున్నారు. ఈ కార్యాలయాన్ని సీఎం కార్యాలయంగా చేసుకుని పని చేశారు. 53 సంవత్సరాలు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న వ్యక్తి చంద్రబాబు. అవతల వైపు ఎంతమంది మారినా.. ఇటువైపు చంద్రబాబు ఒక్కరే నిలబడ్డారు. రాష్ట్రం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. 1995-2004 మధ్య చంద్రబాబు తెచ్చిన 63 ప్రాజెక్టుల్లో.. 2004 తర్వాత వైఎస్ 62 ప్రాజెక్టులను కొనసాగించారు. కానీ, జగన్ మాత్రం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ తిరగదోడారని మండిపడ్డారు. జగన్ సొంతంగా ఒక్క ప్రాజెక్టు తెచ్చింది లేదు. ఒక్క ఇటుక పెట్టి పని చేసింది లేదు. రాష్ట్రం ఒక్కటిగా ఉండాలని ప్రజలు చేసిన పోరాటం మా కళ్ల ముందు ఉంది. విభజన కష్టాలతో ఉన్న సమయంలో నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం మేం పని చేశాం. కానీ జగన్ మాత్రం ఎలా ఆలోచించారో ఈ వీడియోల ద్వారా ప్రజలు చూశారు. జగన్ 3 రాజధానులకు అప్పటి సభ్యులు చప్పట్లు కొట్టారు. కేవలం బటన్ నొక్కడంతోనే ప్రజల బతుకులు సాగాలని జగన్ కోరుకున్నారు. సింగపూర్ మాస్టర్ ఎ÷-లాన్‌తో లక్షన్నర ఉద్యోగాలు వస్తాయి. జగన్ మాత్రం పురిట్లో బిడ్డను చంపినట్లు అమరావతిని చంపాలని చూశారని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ అమరావతిని నిలబెట్టేందుకు కృషి చేశారు. వైసీపీ నేతలు ఓ వైపు రాజధాని కావాలంటారు.. మరోవైపు అమరావతిలోనే ఖర్చు చేస్తున్నారని ప్రచారం చేస్తారు. రాజధాని అంటే కేవలం నాలుగు భవనాలు కాదు. రాజధాని గ్రోత్ ఇంజిన్‌లా ఉండాలని చంద్రబాబు భావించారు. హైదరాబాద్ విషయంలో ఇదే విషయం రుజువైంది. అదే తరహా నగరం ఏపీ రాజధానిగా ఉండాలని చంద్రబాబు భావించారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలోని యువకులకు సైతం మాకు మంచి రాజధాని ఉందనుకునేలా చేశారు. రెండున్నరేళ్లపాటు అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీశాయని అన్నారు.